క్లుప్తంగా

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



దంతాలపల్లి: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్‌రావు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌గా మారిన టీఆర్‌ఎస్ పార్టీకి నూకలు చెల్లాయన్నారు. బీజేపీలో చేరికలు పెరిగాయని, బీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక విధానాలే గెలిపిస్తాయని తెలిపారు. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచి పేద మధ్య తరగతి ప్రజలనడ్డి విరిచారని ప్రజలపై భారం మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, మండల అధ్యక్షుడు శ్రీనువాస్, రాజేష్ పాల్గొన్నారు.

మెడికల్ బిల్లులు విడుదల చేయాలి

నెహ్రూసెంటర్: మెడికల్ బిల్లులు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని జిల్లా కేంద్రానికి రిటైర్డ్ పీఆర్ సూపరింటెండెంట్ తోట రఘురామయ్య ఆదివారం తెలిపారు. తనకు నిమ్స్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ అయిందని, సంబంధిత కార్డియాలజీ వైద్యుడి సూచన మేరకు ప్రతి మూడునెలలకు ఒకసారి గుండె వైద్య పరీక్షలు చేయించుకుంటున్నానని పేర్కొన్నారు. మెడికల్ బిల్లు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సమర్పించినప్పటికీ మంజూరు కాలేదన్నారు. సంబంధిత అధికారులు అడిగితే సమాధానం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

యాకమ్మకు జాతీయ అవార్డు ప్రదానం



మహబూబాబాద్ అర్బన్: ఖమ్మం జిల్లాలో నిర్వహించిన జాతీయ కవితల పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు, కవయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో యాకమ్మకు తెలంగాణ కవులు, రచయితల సంఘం రాష్ట్ర నాయకులు నువ్వా శ్రీనివాస్, వంశీకృష్ణ చేతుల మీదుగా ఆదివారం జాతీయ అవార్డును అందజేశారు.

భరత్‌కు ఉత్తమ అవార్డు



కురవి: మండలంలోని తిర్మలాపురం గ్రామానికి చెందిన యువ కవి బొల్లోజు భరత్‌కు ఆదివారం జిల్లాలోని దంతాలపల్లిలో జరిగిన వికాస వేదిక సాహిత్య సంస్థ శతాధిక కవి సమ్మేళనం-2023 అవార్డు అందించి సన్మానించారు. భరత్ రచించిన ఆకలి అనే కవిత పఠనానికి ఉత్తమ అవార్డును గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డును అందుకుని అభినందనలు పొందాడు.

'గుడుంబా నియంత్రణలో విఫలం'

గార్ల: మండలంలో గుడుంబాను నియంత్రించడంలో సంబంధిత ఎక్సైజ్ అధికారులు వైఫల్యం చెందారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో కాపుసారా విక్రయాల వ్యాపారం మూడుపూలు ఆరుకాయలుగా విరాజిల్లుతుంది. గార్లలోని అంబేద్కర్‌నగర్, తహసీల్దార్ బజారు, పుట్టకోట, జీవంజిపల్లి, పూసలతండా, పూమ్యాతండా, రాంపురం, అంజనాపురం, పినిరెడ్డిగూడెం, గోపాలపురం, గ్రామాల్లో సైతం గుడుంబా విచ్చలవిడిగా లభిస్తుంది. సంబంధిత శాఖ అధికారులు మాత్రం వచ్చి నామమాత్రంగా తనిఖీలు చేసి విక్రయదారుల నుంచి నెలవారి మామూళ్లు తీసుకొని వెళ్లిపోతున్నారని ఈ ప్రాంత మహిళలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రమైన గార్లలోనే భయం భక్తి లేకుండా గుడుంబా విచ్చలవిడిగా దొరుకుతుందంటే, మండలంలోని మిగతా గ్రామాల్లో గుడుంబా విక్రయాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఎక్సైజ్ అధికారి స్పందించి మండలంలో గుండుంబా విక్రయాలను అరికట్టి, ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామ శివారులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. బైక్‌పై రవి, సుమంత్‌లు కాంపల్లి వైపు వస్తున్నారు. కాంపల్లి శివారులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమయంలో అటు వైపుగా వస్తున్న సీరోలు ఎస్సై ఎల్.నరేష్ జరిగిన ప్రమాదాన్ని గమనించి గాయపడిన వ్యక్తులను వెంటనే అంబులెన్స్‌లో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి..

- డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్



కండువా కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో డోర్నకల్ మండలం బంజర గ్రామానికి చెందిన కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి 22 కుటుంబాలు, వందమంది ఎమ్మెల్యే రెడ్యానాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతీ కార్యకర్త కుటుంబానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్న రమణ, వైస్ చైర్మన్ కోటిలింగం, పీఏసీఎస్ భిక్షంరెడ్డి, జెడ్పీటీసీ రామనాథం, బంజర సర్పంచ్ అంకటి సీతారామయ్య, నాయకులు కృష్ణయ్య, శ్రీనివాస్, వైస్ ఎంపీపీ వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా కేసీఆర్ వినూత్న పథకాలను ప్రవేశపెడుతున్నారని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఉగ్గంపల్లిలో తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆయూబ్‌పాషా, నాయకులు చెన్నయ్య, ధారాసింగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

మండల కేంద్రానికి చెందిన నట్టి భద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం భద్రయ్య మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆయూబ్ పాషా, దారాసింగ్, చెన్నయ్య, తదితరులు ఉన్నారు.

బొడ్రాయి వేడుకలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలో ఫిబ్రవరి 5వ తేదీన నిర్వహించే బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పండగను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్, బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 1వ తేదీన బొడ్రాయి శోభాయాత్ర, 2న పాత బొడ్రాయి తీయడం, 3న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జలాభిషేకం, సాయంత్రం 5 గంటలకు యాగశాల వద్ద కుంకుమ పూజ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. 4వ తేదీ మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, 5వ తేదీ ఉదయం 4:49 నిమిషాలకు బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన, ఉదయం 8గంటలకు కులానికి ఒక బోనం బొడ్రాయి వద్దకు తీసుకురావాలని తెలిపారు. ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు బలిముద్ద వేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఎండి ఫరీద్, మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్ రెడ్డి, మాలె నాగేశ్వర్ రావు, గద్దె రవి, ఎడ్ల రమేష్, అజయ్ సారథి, సూర్నపు సోమయ్య, పిల్లి సుధాకర్, ఆకుల హరిప్రసాద్, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, రాజు, పుష్పలత, నీరజ, కుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రూ.51,116 విరాళం అందజేత

జిల్లా కేంద్రంలో జరుగనున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి రిటైర్డ్ ఉపాధ్యాయులు బొల్లోజు రత్నమాచారి దంపతులు రూ.51,116 మొత్తాన్ని ఆదివారం విరాళంగా అందజేశారు.

మహిళలకు భద్రత కరువు



మాట్లాడుతున్న ఉపేందర్

నెహ్రూసెంటర్: మహిళలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. శ్రామిక మహిళా జిల్లా స్థాయి సదస్సు జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈసందర్భంగా కుంట ఉపేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల ద్వారా మహిళలకు భద్రత కరువైందని, తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళలను పురుషులతో సమానం చూడాలని, కనీస వేతనం ఇచ్చి గౌరవించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చింతా మౌనిక, కోకన్వీనర్లు గుగులోత్ సరోజ, తోట పుష్ప, నాయకులు కృష్ణవేణి, సంధ్య, శోభా, ఉమా, భాగ్యమ్మ, రేణుక, అరుణ, స్వప్న, రవళి, లలిత, సునీత పాల్గొన్నారు.

మత్స్యకారులపై దాడి

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో పెద్ద చెరువులో కొందరు వ్యక్తులు దొంగతనంగా చేపలను పడుతుండగా పట్టుకున్న మత్స్యకారులపై తండా వాసులు ఆదివారం దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచిన సంఘటన జరిగింది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. నేరడ పెద్ద చెరువులో మధ్యాహ్న సమయంలో ఎల్కచెట్టు తండా జీపీ పరిధిలోని భద్రు తండాకు చెందిన గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు వలలు వేసి చేపలను పడుతున్నారు. ఈసమయంలో నేరడకు చెందిన మత్స్యపారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు దుస్స వెంకన్న, దుస్స నవీన్‌లు చేపలు పడుతున్న గిరిజనులను పట్టుకునేందుకు యత్నించారు. దీంతో వలలు అక్కడ పడేసి వారు పరారయ్యారు. అందులో జాటోత్ శంకర్ అనే వ్యక్తి మత్స్యకారులకు దొరికాడు. అతన్ని తీసుకుని వస్తుండగా పరారీ అయిన ఎల్కచెట్టు తండా జీపీ శివారు భద్రు తండాకు చెందిన ఏడుగురు వ్యక్తులు బానోత్‌శంకర్, బానోత్ వీరన్న, జాటోత్ నరేష్, జాటోత్ బాలు, జాటోత్ శంకర్, జాటోత్ శ్రీనులు కలసి రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు బాధితులు వెంకన్న, నవీన్‌లు తెలిపారు. దాడిలో దుస్స వెంకన్నకు చేయి, నడుముకు బలమైన గాయాలయ్యాయి. గాయాలైన వారిని మహబూబాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కురవి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. మత్స్యకారులపై దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిట్టల వెంకన్న, చెన్నబోయిన దర్గయ్య, మైస అశోక్‌లు డిమాండ్ చేశారు.

స్లాట్ బుక్ సేవలు మెరుగుపర్చాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

పెద్దవంగర: ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ సేవలను మెరుగుపరిచేలా చొరవ చూపాలని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి ఐలయ్య కోరారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శశాంకను ఎంపీపీ కలిసి పెద్దవంగర మండలంలోని పలువురి దివ్యాంగుల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. శారీరక వైకల్యం, బుద్ధిమాంద్యం, వినికిడి లోపం, మానసిక రుగ్మతులతో బాధపడుతున్న వారికి వెంటనే సర్టిఫికెట్లు అందేలా చూడాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ అదేశాలు జారి చేసినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, బీఆర్‌ఎస్ నాయకులు అంజనేయులు, మండల యూత్ అధ్యక్షుడు హరీశ్, ఉప సర్పంచ్ చంద్రయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



మాట్లాడుతున్న అల్వాల వీరయ్య

నెహ్రూసెంటర్: ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఖాళీ స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య అన్నారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం మండ రాజన్న అధ్యక్షతన సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. 58, 59 జీఓ కింద దరఖాస్తు చేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు. భూసమస్యలు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని 3వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన, ఫిబ్రవరి 9న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎండి కుర్ర మహేష్, బాణాల రాజన్న, ఎండి యాకుబ్, తిలక్‌బాబు, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు గుడి కట్టించిన కుమారులు



విగ్రహాలను ఏర్పాటు చేసి, పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: తల్లిదండ్రులను బతికి ఉండగానే పట్టించుకోని ఈ రోజుల్లో చనిపోయిన తమ తల్లిదండ్రులు, తాము బతికున్నంత కాలం కళ్లముందర గుర్తుండిపోయేలా కొడుకులు విగ్రహాలతో తల్లిదండ్రులకు గుడి కట్టించి కన్నప్రేమను చాటుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి శివారు జామ్లాతండాలో ఆదివారం చోటుచేసుకుంది. తండాకు చెందిన కోమటిపల్లి మాజీ సర్పంచ్ గుగులోతు జామ్లానాయక్ గత ఏడాది జనవరి 30న, అతడి భార్య బుగ్గి గత ఏడాది ఆగస్టు 17న అనారోగ్యంతో మృతిచెందారు. ఈ మేరకు ఆదివారం జామ్లానాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా రూ.1.50లక్షలతో జామ్లానాయక్, బుగ్గిల విగ్రహాలను తయారు చేయించి తండా ప్రధాన రహదారి పక్కన గుడి కట్టించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి జామ్లా, బుగ్గిల విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు గుడిని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలం యాకయ్య, కాంగ్రెస్ నేత మురళీనాయక్, మల్లేశం, కూరెల్లి సతీష్, ఇస్లావత్ చందు, సారయ్య, యాకమూర్తి తండావాసులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే సమస్యలకు పరిష్కారం



అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న చంద్రయ్య

నర్సింహులపేట: చదువుతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్, హైకోర్టు మాజీ జస్టిస్ గుండా చంద్రయ్య అన్నారు. మండలంలోని బొజ్జన్నపేటలో ఆదివారం అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతీ ఒక్కరు కొనసాగించాలని కోరారు. గ్రామంలో విగ్రహం ఏర్పాటు చేసినందుకు ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. అంతకు ముందు చంద్రయ్యను శ్రీవేంకటేశ్వర ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి పట్టు వస్త్రాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ అధికారి పీఎస్.మూర్తి, సర్పంచ్ రజిత, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గార్ల: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న ఆదివారం తెలిపారు. గార్ల మండలం బుద్దారంతండా సమీపంలోని నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లలో పేకాట ఆడుతున్న బొడ్ల వసంతరావు, జి.నాగేష్, జి.రమేష్, వి.సురేష్, బి.పాండుకుమార్ పేకాట ఆడుతున్నారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు చేసి వారి వద్ద నుంచి రూ.5,600 నగదు, 3సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

క్రీడా మైదానాన్ని కాపాడాలి

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన క్రీడా మైదానాన్ని కాపాడాలని అథ్లెటిక్స్ కోచ్ కర్నం సింధూవర్మతోపాటు పలువురు క్రీడాకారులు ఆదివారం డిమాండ్ చేశారు. హైస్కూల్ మైదానానికి ఆనుకుని ప్రాథమిక పాఠశాల ఉందని, దాని అభివృద్ధి పేరుతో మైదానానికి వెళ్లే దారికి అడ్డంగా ప్రహరీ నిర్మించేందుకు యత్నించడాన్ని నిలిపివేయాలని తెలిపారు. ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సహకారంతో 200మీటర్ల ట్రాక్‌ను నిర్మించినట్లు తెలిపారు. జరిగిందని, వందలాది మంది చిన్నారులకు స్పోర్ట్స్ స్కూల్, అకడామిల్లో సీట్లు పొంది ఉన్నారని తెలిపారు. ప్రహరీ నిర్మించడం ద్వారా ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. అభివృద్ధి పేరుతో మైదానంలో ఇష్టానుసారంగా భవనాలు, గోడలు నిర్మిస్తే మైదానం చెడిపోతుందని, వెంటనే ప్రజాప్రతినిధులు నిలిపివేయాలని కోరారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశాలీలు

తొర్రూరు: పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని, ఆ దిశగా అడుగులు వేయాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో మండల పద్మశాలీ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కస్తూరి పులేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమ్మేళనంలో వెంకన్న మాట్లాడారు. చేనేత కార్మికులు, పద్మశాలీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటనారాయణ, డాక్టర్ చందా మల్లయ్య, నాయకులు కూరపాటి రమేష్, మార్త రమేష్, రామకృష్ణ, పెండెం రమేష్, బుదారపు శ్రీనివాస్, కూరపాటి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాలిక అదృశ్యం

కురవి: మండలంలోని ఓ గ్రామంలో బాలిక అదృశ్యం అయినట్లు కురవి ఎస్సై బి.రాము ఆదివారం తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దరఖాస్తుల స్వీకరణ

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్‌స్కూల్‌లో 2023–24 విద్యాసంవత్సరానికి గాను, 6నుంచి 10వ తరగతి వరకు సీట్ల కోసం వచ్చేనెల ఫిబ్రవరి 10 నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రూపాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వతరగతిలో 100 సీట్లకు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు జాతీయ జెండా ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్: ఏఐసీసీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతురాజు రాజు ఆదివారం తెలిపారు.

యువకవికి సన్మానం

దంతాలపల్లి: మండలం రామానుజపూరం గ్రామానికి చెందిన యువ కవి చిర్ర సతీష్‌ను ఆదివారం నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామంలో ప్రముఖులచే సన్మానం పొందినట్లు తెలిపారు.


కులవృత్తుల పాత్ర కీలకం

గార్ల: ఆధునిక మానవ నాగరిక సమాజ నిర్మాణంలో కుల వృత్తుల పాత్ర అత్యంత కీలకమైందని నాయీబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం మండల అధ్యక్షుడు జంపాల సతీష్ అన్నారు. ఆదివారం గార్లలో సంఘం రూపొందిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో విశ్వ, మాధవరావు, సైదులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన కేంద్రం ప్రారంభం

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామంలో ఆదివారం నిరుపేద వృద్ధులకు నిత్యాన్నదాన కేంద్రంను ప్రారంభించినట్లు సర్పంచ్ చీకటి ప్రవీన్ తెలిపారు. ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన శ్రీరామగిరి అమరేంద్రచారి శాంతి చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కదిర జగన్, వార్డు సభ్యులు సతీష్, పుల్లయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సన్మానం




మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ కోఠి మహిళా కళాశాలలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్ సంయుక్తంగా ఆధ్వర్యంలో క్రీడల్లో మహిళల పాత్ర అనే సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మానుకోట అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అథ్లెటిక్ అంతర్జాతీయ క్రీడాకారిణి బాస నాగమణిని హాజరుకాగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, పద్మ, సుద్దాల లక్ష్మి, రేవతి, సెక్రటరీ కృష్ణకుమారి ఘనంగా సన్మానించి సత్కారించారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

కురవి: మండల కేంద్రానికి చెందిన నాగార్జున విద్యాలయానికి చెందిన 150మంది విద్యార్థులు వరంగల్‌కు విజ్ఞాన యాత్రకు ఆదివారం తరలివెళ్లారు. వరంగల్ నగరంలోని భద్రకాళీ ఆలయం, జూపార్క్, వేయిస్తంభాల ఆలయం సందర్శించారు. కాకతీయ రాజులు నిర్మించిన వేయిస్తంభాల ఆలయం, భద్రకాళీ అమ్మవారి ఆలయం విశిష్టతను గైడ్‌తో వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, కవిత, ప్రదీప్, లింగన్న, జగదీశ్, గ్రేసస్, రమ్య పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి



తొర్రూరు: ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని కరాటే సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊరుగొండ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్కులో శ్రీధర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బెల్టులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వింజమూరి సుధాకర్, కరాటే మాస్టర్ సోమ శ్రీధర్, ప్రతినిధులు సోమయ్య, కళావతి, వల్లపు మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

నిస్వార్థపరుడు తాళ్లూరి నర్సయ్య

గార్ల: ప్రజల గుండెల్లో నిస్వార్థ కమ్యూనిస్టుగా నిలిచిన వ్యక్తి తాళ్లూరి నర్సయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నర్సయ్య వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్ లోకేశ్వరరావు, హరి, రాజారావు, గోవింద్, వీరస్వామి పాల్గొన్నారు.

కార్పొరేట్ దాడిని తిప్పికొట్టాలి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్: దేశ వ్యాప్తంగా ఇటీవల కుల వృత్తులపై కార్పొరేట్ శక్తులు చేస్తున్న దాడిని తిప్పికొట్టాలని నాయీబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (నోపా) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎడ్ల కొమురయ్య అన్నారు. నోపా క్యాలెండర్ ఆవిష్కరణ అనంతాద్రి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల వృత్తులపై వివక్ష చూపుతున్నాయని, సామాజిక సేవ చేస్తున్న కుల వృత్తుల కుటుంబాలను అణిచివేతకు గురి చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వై.కృష్ణప్రసాద్, జిల్లా నాయకులు కొండూరి వెంకన్న, జంపాల విశ్వ, దయానంద్, యాకయ్య, దుర్గయ్య, వీరభద్రం, రంజిత్, విక్రం, దశరథం, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చెరువుగుంతలో పడి పశువుల మృతి



మృతిచెందిన పాడి పశువులు

గూడూరు: మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు హాముతండా సమీపంలోని తుమ్మలకుంట చెరువు గుంతలో పడి రెండు పాడి పశువులు ఆదివారం మృతిచెందాయి. బాధిత రైతు శంకర్ తెలిపిన వివరాల ప్రకారం పొలం దున్నిన తర్వాత రెండు పాడి పశువులను సమీపంలోని చెరువులో శుభ్రం చేయడానికి వాటితోపాటు వెళ్లాడు. కానీ చెరువు శిఖం సమీపంలో ఓ పెద్ద గుంత నిండ నీరు ఉండడంతో ప్రమాదవశాత్తు రెండు పాడి పశువులు అందులో పడి మృతిచెందాయి. సుమారు రూ.80 వేల విలువ చేసే పాడి పశువులు గుంతలో పడి మృతిచెందడంపై బాధితులు బోరున విలపించారు. అధికారులు గుర్తించి ఆర్థిక సహాయం అందించాలని వేడుకున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బయ్యారం: క్రీడలతో యువకుల్లో దేహధారుఢ్యం పెంపొందడంతోపాటు, శారీరక మానసికోల్లాసం లభిస్తుందని ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాతా గణేష్, సర్పంచ్ మమత, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మరిపెడ: వేదికపై పూర్వ విద్యార్థులు, గురువులు



కురవి: బలపాల హైస్కూల్‌లో..

మరిపెడ: మరిపెడలో 1984–85సంవత్సరం పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. తాము చదువుకున్న రోజుల్లో విద్యను బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు.

కురవి: మండలంలోని బలపాల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1978–1979 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం హైస్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు.

పంట వ్యర్థాలకు నిప్పు

మహబూబాబాద్ రూరల్: రైతులు పంటలు సాగు చేసిన అనంతరం మిగిలిన వ్యర్థాలను తొలగించే సందర్భంలో వాటికి నిప్పుపెట్టి పర్యావరణ కాలుష్యానికి కారకులవుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కాల్చవద్దని చెబుతున్నప్పటికీ కొందరు రైతులు మాత్రం అవేమి తమకు పట్టనట్లు వ్యవహరిస్తూ కాలబెడుతున్నారు. దీంతో సమీప ప్రాంత రైతుల వ్యవసాయ పనులకు అటంకం ఏర్పడడంతోపాటు భూసారం దెబ్బతినేందుకు కారకులవుతున్నారు. మండలంలోని నడివాడ, రెడ్యాల గ్రామాల శివారులో పలువురు రైతులు పంట వ్యర్థాలను కాల్చడం కనిపించింది.